



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 05 సంచిక : 194 | గురువారం 13 ఆగస్టు 2026 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 | ఫోన్ : 9441877695













2 లో

## త్వరలో 'జంతర్ మంతర్–2'!

### హాల్ ఇవ్వకుండా అడ్డుకున్నారు.. బీజేపీపై సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దిప్కే ఆరోపణలు

న్యూఢిల్లీ,12 ఆగస్టు (కెరటం న్యూస్): ఢిల్లీలో త్వరలోనే 'జంతర్ మంతర్–2' నిరసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని సీజేపీ అధ్యక్షుడు అభిజీత్ దిప్కే ప్రకటించారు. పార్టీ వాలంటీర్ల సమావేశానికి హాల్ కేటాయించకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ బీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. హాల్ యజమానులపై ఒత్తిడి తెచ్చి సమావేశం జరగకుండా చేశారని ఆరోపించారు.

## బీసీ మహిళలకు సర్కార్ 'మిషన్'



2 లో

హైదరాబాద్,12 ఆగస్టు (కెరటం న్యూస్): బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందించనుంది.

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టుమిషన్లను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో మిషన్లు అందించడం పథకం ప్రత్యేకత.



2 లో

## చంద్రబాబుది సొంత డబ్బా!

న్యూస్ డెస్క్, 12 ఆగస్టు (కెరటం న్యూస్): రాష్ట్రం ఆర్థికంగా పరుగులు పెడుతోందని, జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధిరేటు సాధిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సొంత డబ్బా అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. 2025--26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు నమోదైందంటూ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు.

## అడ్డదారులు వద్దు.. అంతిమంగా నష్టమే!

- యువతకు ప్రధాని మోదీ సూచన.. సోషల్ మీడియా, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హితవు



2 లో

న్యూఢిల్లీ,12 ఆగస్టు (కెరటం న్యూస్): జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి తాత్కాలికంగా సులువుగా కనిపించినా అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు సూచించారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, రీల్స్ ప్రభావం విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో బుధవారం ప్రధాని మోదీ ప్రసంగించారు.

## మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు

### మేడిగడ్డ కేసు విచారణ సెప్టెంబర్ 9కి వాయిదా

### కేసీఆర్‌కు సమన్లు అందలేదా?.. మరోసారి పంపాలని కోర్టు ఆదేశం

### హైకోర్టు సూచనలతో జిల్లా కోర్టులోనే విచారణ..



2 లో

భూపాలపల్లి, 12 ఆగస్టు (కెరటం న్యూస్): : కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణను న్యాయస్థానం సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. కేసులో ప్రధాన పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో విచారణ కొనసాగింపుపై హైకోర్టు ఇచ్చిన సూచనలను జిల్లా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

## మిల్లర్లకు సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్..

### బ్లాక్‌మెయిల్ చేస్తే సహించం.. డిఫాల్ట్ మిల్లుల స్వాధీనానికి ఆదేశాలు

- డిఫాల్ట్ అయితే.. మిల్లులు ప్రభుత్వానివే!
- మిల్లర్ల ఆటలు సాగవు: రేవంత్
- గోల్‌మాల్ చేస్తే మిల్లులు స్వాధీనం!



హైదరాబాద్, 12 ఆగస్టు (కెరటం న్యూస్): తెలంగాణలో రైస్ మిల్లర్ల గోల్‌మాల్ వ్యవహారాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయి ప్రభుత్వ బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వాధీనం చేసుకున్న మిల్లులను అవసరమైతే మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించి మిల్లింగ్ బాధ్యతలు నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. మిల్లర్ల నుంచి బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా పక్కా విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు.

ఈ విధానంపై త్వరలో కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. ప్రభుత్వ బకాయిల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

### మహిళా సంఘాలకు గోడౌన్ల బాధ్యత

ధాన్యం దిగుబడి అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి తొలిదశలో ఐదు నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా భారీ గోడౌన్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గోడౌన్లను నిర్మించనున్నారు. ఇందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

మార్కెట్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న గోడౌన్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, వాటి నిర్వహణపై పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు ఒక నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించారు.

సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రండి!

- జగన్‌కు హోంమంత్రి అనిత సవాల్.. ఆధారాలతో రండి, ప్రతి ఆరోపణకు సమాధానం ఇస్తాం



2 లో

అమరావతి,12 ఆగస్టు (కెరటం న్యూస్):: ప్రభుత్వంపై బయట ఆరోపణలు చేయడం కాకుండా వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి తమ వద్ద ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలని సవాల్ చేశారు.

# బీసీ మహిళలకు సర్కార్ 'మిషన్'

మొదటి పేజీ తరువాయి

ఆగస్టు 13న మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని జీ-29లో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి.. విధివిధానాలు, బడ్జెట్, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర వివరాలను వెల్లడించనున్నారు.

ఆధునిక కుట్టుమిషన్లతో మహిళలు ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందడంతో పాటు ఆదాయం పెంచుకునే అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు. బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం కీలక ముందడుగుగా నిలవనుంది.

# త్వరలో 'జంతర్ మంతర్-2'!

మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో సీజేపీ వాలంటీర్ల సమావేశం నిర్వహించేందుకు హాల్ కోసం ప్రయత్నించామని, అయితే ఎవరూ అద్దెకు ఇచ్చేందుకు ముందుకు రాలేదని దిప్కే తెలిపారు. అన్ని చోట్లా పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. చివరకు ఒక హాల్‌ను బుక్ చేసుకుని, దానికి సంబంధించిన రసీదును కూడా పొందామని చెప్పారు.

అయితే మంగళవారం ఉదయం హాల్ యజమానులకు బెదిరింపులు వచ్చాయని దిప్కే ఆరోపించారు. సీజేపీ సమావేశానికి హాల్ ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారని అన్నారు. "ఇదంతా బీజేపీయే చేస్తోంది" అని ఆరోపించారు. ఇలాంటి చర్యలు దేశ యువత పట్ల బీజేపీకి ఉన్న భయాన్ని స్పష్టం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు.

"ఇలాంటి చిన్నచిన్న చర్యలకు మేము భయపడతామని వారు అనుకుంటే పొరపాటే. జంతర్ మంతర్ సీజన్-2 చాలా త్వరలో ప్రారంభం కాబోతోంది" అని దిప్కే ప్రకటించారు.

అయితే హాల్ బుకింగ్ విషయంలో ఒత్తిడి, బెదిరింపులకు సంబంధించి అభిజీత్ దిప్కే చేసిన ఆరోపణలపై బీజేపీ నుంచి ఇంకా స్పందన వెలువడలేదు.

# మేడిగడ్డ కేసులో మరో ట్విస్ట్.. కేసీఆర్‌కు మళ్లీ సమన్లు

భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణను న్యాయస్థానం సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. కేసులో ప్రధాన పిటిషనర్ రాయలింగమూర్తి మృతి చెందడంతో విచారణ కొనసాగింపుపై హైకోర్టు ఇచ్చిన సూచనలను జిల్లా కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

ఈ వివాదాన్ని జిల్లా కోర్టు పరిధిలోనే పరిష్కరించుకోవాలని హైకోర్టు సూచించిన నేపథ్యంలో కేసు విచారణను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. అయితే మాజీ సీఎం కేసీఆర్‌కు గతంలో జారీ చేసిన సమన్లు ఇంకా అందలేదని కోర్టు దృష్టికి రావడంతో.. మరోసారి సమన్లు జారీ చేయాలని జిల్లా న్యాయవాదిని ఆదేశించింది.

సెప్టెంబర్ 9కి విచారణ

ఈ కేసులో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉందన్న నేపథ్యంలో హైదరాబాద్ నుంచి ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులు జిల్లా కోర్టుకు హాజరయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తరఫు న్యాయవాదులు కూడా కోర్టుకు వచ్చారు. దీంతో ఉదయం నుంచే కేసుపై ఉత్కంఠ నెలకొంది.

అయితే కోర్టు విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేయడంతో తుది నిర్ణయం కోసం మరోసారి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తదుపరి విచారణలో కేసు ఏ మలుపు తిరుగుతుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.

# రోడ్డెక్కడం కాదు.. అసెంబ్లీకి రండి!



అమరావతి,12 ఆగస్టు (కెరటం న్యూస్):: ప్రభుత్వంపై బయట ఆరోపణలు చేయడం కాకుండా వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత సూచించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి తమ వద్ద ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలని సవాల్ చేశారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు తమ నియోజకవర్గ సమస్యలను శాసనసభలో ప్రస్తావించడం బాధ్యత అని పేర్కొన్నారు.

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం అనిత మీడియాతో మాట్లాడారు. జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజల తరఫున మాట్లాడాలని అన్నారు. "రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు.. అసెంబ్లీకి వచ్చి చర్చించండి. ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు" అని స్పష్టం చేశారు.

మెగా డీఎస్సీపై ఆరోపణలు సరికాదు

మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీని కూడా పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభను అవమానించడమేనని అనిత అన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసి, కుటుంబాలకు దూరంగా ఉంటూ కోచింగ్ తీసుకుని కష్టపడి విజయం సాధించిన యువతలో అనుమానాలు సృష్టించవద్దని సూచించారు. ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించాలని, ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

65 వినతులు.. సిట్‌తో దర్యాప్తు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజా వినతుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 65 వినతులను హోంమంత్రి స్వీకరించారు. సమస్యలను స్వయంగా తెలుసుకుని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పలువురు బాధితులు హోంమంత్రిని ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో సుమారు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని అనిత తెలిపారు. ఫిర్యాదులపై దర్యాప్తు కోసం డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దర్యాప్తులో తేలే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అడ్డదారులు వద్దు.. అంతిమంగా నష్టమే!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా రైల్వే స్టేషన్లలో కనిపించే "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" అనే హెచ్చరికను ప్రస్తావించారు. అది కేవలం రైల్వే ట్రాక్‌లకు మాత్రమే కాకుండా జీవితానికీ వర్తిస్తుందని అన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా రైల్వే పట్టాలు దాటుతుంటారని, ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకంగా మారుతాయని ప్రధాని హెచ్చరించారు. ఇదే విధంగా జీవితంలోనూ సులువైన మార్గాల కోసం తప్పుదారులు ఎంచుకోవద్దని సూచించారు.

యువత తప్పుడు మార్గాలను విడిచిపెట్టి అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని మోదీ పిలుపునిచ్చారు. తాము ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను చదివి, వారి అనుభవాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ముఖ్యంగా తమ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్‌ను విచక్షణతో చూడాలని, రీల్స్ ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రధాని హితవు పలికారు.

# ట్రంప్ దిగే వరకు పోరాటమే!

ఇంటర్నెట్ డెస్క్ ,12 ఆగస్టు (కెరటం న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవిలో ఉన్నంతకాలం అమెరికాతో పోరాటాన్ని కొనసాగించే అవకాశం ఉందని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) సీనియర్ సలహాదారు మహ్మద్ రెజా నక్ది సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాపై దీర్ఘకాలిక ఒత్తిడి పెంచడం ద్వారా భవిష్యత్తులో ఇరాన్‌పై దాడి చేయాలనుకునే ఏ దేశమైనా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందనే భయాన్ని కలిగించడమే తమ లక్ష్యమని తెలిపారు.

పీబీఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నక్ది మాట్లాడుతూ.. ఇరాన్‌కు శాశ్వత భద్రత కల్పించేందుకు బలమైన నిరోధక శక్తిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా అమెరికాపై ఒత్తిడి పెంచుతూ యుద్ధాన్ని తదుపరి అధ్యక్ష పదవీకాలం వరకు కొనసాగించడం ఒక మార్గమని పేర్కొన్నారు. "అమెరికాపై పోరాడటం ఎలాగో నేర్చుకున్నాం. విజయం కచ్చితంగా మా వైపే ఉంది" అని వ్యాఖ్యానించారు.

అమెరికా స్పష్టమైన వ్యూహం లేకుండానే యుద్ధం చేస్తోందని నక్ది ఆరోపించారు. వాషింగ్టన్ తన లక్ష్యాలను పదేపదే మార్చుకుంటోందని విమర్శించారు. ఖార్గ్ ద్వీపంపై దాడి, హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం వంటి అంశాలను అమెరికా తన లక్ష్యాలుగా పేర్కొంటోందని తెలిపారు.

'క్షిపణుల తయారీ వేగం పెంచాం'

యుద్ధం ఎంతకాలం కొనసాగితే తమకు అంత అనుభవం పెరుగుతుందని నక్ది అన్నారు. గత ఐదు నెలల్లో అమెరికాతో ప్రత్యక్ష పోరాటం ద్వారా ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నామని చెప్పారు. అమెరికా సైన్యం తాము ఊహించిన దానికంటే బలహీనంగా ఉందని వ్యాఖ్యానించారు.

తాము రోజూ ప్రయోగించే క్షిపణుల కంటే ఎక్కువ సంఖ్యలో కొత్త క్షిపణులను తయారు చేస్తున్నామని నక్ది పేర్కొన్నారు. యుద్ధం సుదీర్ఘంగా కొనసాగినా క్షిపణి దాడులు కొనసాగించే సామర్థ్యం తమకు ఉందని సంకేతమిచ్చారు. అయితే ఆయన చేసిన ఈ వాదనలను స్వతంత్రంగా ధ్రువీకరించలేమని సమాచారం.

హార్ముజ్‌లో తగ్గిన రాకపోకలు

అమెరికా-ఇరాన్ ఘర్షణలో వ్యూహాత్మకమైన హార్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 130 నుంచి 140 నౌకలు ఈ మార్గంలో ప్రయాణించగా.. తాజా షిప్పింగ్ డేటా ప్రకారం మంగళవారం కేవలం 8 నౌకలు మాత్రమే జలసంధిని దాటినట్లు రాయిటర్స్ పేర్కొంది.

హార్ముజ్‌ను తిరిగి తెరవాలంటే అమెరికా దిగ్బంధనాన్ని ముగించడం, ఆంక్షలను సడలించడం, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం వంటి రాయితీలు ఇవ్వాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.

కాల్పుల విరమణపై భిన్నాభిప్రాయాలు

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణను పొడిగించే విషయంలోనూ అనిశ్చితి కొనసాగుతోంది. కాల్పుల విరమణను పొడిగించే ప్రశ్నే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇరు దేశాల మధ్య తాత్కాలిక అవగాహనను పునరుద్ధరించే అంశంపై భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి.

ట్రంప్ తదుపరి అధ్యక్ష పదవీకాలం వచ్చే వరకు యుద్ధాన్ని కొనసాగించవచ్చన్న నక్ది వ్యాఖ్యలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న అమెరికా-ఇరాన్ సంబంధాలకు మరింత ఆందోళనను జోడించాయి. దీర్ఘకాలిక పోరాటం ద్వారా అమెరికాపై ఒత్తిడి పెంచడం, నిరోధక శక్తిని బలోపేతం చేసుకోవడం ఇరాన్ సైనిక వ్యవస్థలోని కొంత వర్గం వ్యూహంగా భావిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా?



హైదరాబాద్,12 ఆగస్టు (కెరటం న్యూస్): తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (GRMB) ఎజెండాలో ప్రతిపాదించినా.. రాష్ట్ర ప్రభుత్వం ఇంతకాలం ఎందుకు స్పందించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నిలదీసిన తర్వాతే ప్రభుత్వం హడావుడిగా లేఖలు రాస్తోందని విమర్శించారు.

ఏపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ GRMB ఎజెండాలో అంశాలను చేర్చినా.. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఎందుకు అభ్యంతరం చెప్పలేదని హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. GRMBని ఎందుకు నిలదీయలేదని, ఏపీ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు నామమాత్రపు లేఖలు రాస్తే తెలంగాణ ప్రాజెక్టులు కాపాడబడతాయా?" అని ప్రశ్నించారు.

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం రాజీలేని వైఖరి అవలంబించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం GRMB ఎజెండాలో చేర్చిన అంశాలను వెంటనే ఉపసంహరించుకునేలా ఒత్తిడి తీసుకురావాలని, అవి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలని సూచించారు. అవసరమైతే ఆ అంశాలను వెనక్కి తీసుకోకపోతే GRMB సమావేశానికి హాజరుకాబోమని ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు.

రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టొద్దు అని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సమయంలో ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. ఇది రాజకీయ అంశం కాదని, తెలంగాణ భవిష్యత్తు, రాష్ట్ర నీటి హక్కులకు సంబంధించిన విషయమని పేర్కొన్నారు.

ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న GRMB సమావేశం ఎజెండాను ఉపసంహరించుకోకుండా సమావేశం నిర్వహిస్తే.. తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేలాది మందితో GRMB కార్యాలయాన్ని ముట్టడిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. కేంద్రం, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు చేస్తున్న "జల ద్రోహాన్ని" అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# కేటీఆర్ చెప్పే రూ.200 కోట్లు ఎక్కడివి?

హైదరాబాద్,12 ఆగస్టు (కెరటం న్యూస్): నగరంలో భూ కేటాయింపుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై మంత్రి శ్రీధర్‌బాబు తీవ్రంగా స్పందించారు. కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరా భూమిని రూ.90 లక్షలకే కేటాయించారని శ్రీధర్‌బాబు తెలిపారు. తమ ప్రభుత్వం మాత్రం నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.1.5 కోట్ల చొప్పున కేటాయించిందని స్పష్టం చేశారు. ఐదు ఎకరాల భూమిని మొత్తం రూ.7.5 కోట్లకు కేటాయించామని చెప్పారు. అలాంటప్పుడు కేటీఆర్ చెబుతున్న రూ.200 కోట్ల లెక్కలకు ఆధారం ఏమిటో వెల్లడించాలని ప్రశ్నించారు.

అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదోవ పట్టించవద్దని కేటీఆర్‌కు మంత్రి సూచించారు. హిల్ట్ పాలసీతో హైదరాబాద్ ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని, పారిశ్రామికవేత్తలను భయపెట్టడం, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు.

నీటి వాటాలపై రాజీ లేదు

తెలంగాణ నీటి వాటాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు.

# మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి..



అమరావతి,12 ఆగస్టు (కెరటం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ అక్రమాలపై రగడ కొనసాగుతూనే ఉంది. డీఎస్సీ లీకేజీలు, అక్రమాలపై గత 74 రోజులుగా దాదాపు 10 రకాల కార్యక్రమాలు నిర్వహించామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. డీఎస్సీ వ్యవహారంపై బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అక్రమాలకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాలను ప్రజల ముందుంచామని పేర్కొన్నారు.డీఎస్సీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికే ఫస్ట్ ర్యాంకు రావడం, మెరిట్ లిస్టులు మారిన వ్యవహారాలు వెలుగులోకి రావడం వంటి అంశాలను జగన్ ప్రస్తావించారు. డీఎస్సీ లీకేజీ ఎంత దూరం వెళ్లిందో పూర్తిగా తేలాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే విచారణతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయా అని ప్రశ్నించిన జగన్.. డీఎస్సీ అక్రమాలపై కచ్చితంగా సీబీఐ దర్యాప్తు జరగాల్సిందే అని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్ కోటాపైనా ఆరోపణలు

స్పోర్ట్స్ కోటా పేరుతో జీవోలు జారీ చేసి అక్రమాలకు తెరతీశారని జగన్ ఆరోపించారు. డీఎస్సీ పరీక్ష రాయకుండానే, పోటీ పరీక్ష లేకుండానే ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఆ తర్వాత జీవోలు మార్చడం ద్వారా ప్రభుత్వం గత నిర్ణయం తప్పని పరోక్షంగా అంగీకరించినట్లేనని అన్నారు. ఇన్ని ఆరోపణలు, ఆధారాలు ఉన్న నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు.విద్యాశాఖ మంత్రి చంద్రబాబు కుమారుడే అయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ విచారణలో నిష్పాక్షికత ఎలా ఉంటుందని జగన్ ప్రశ్నించారు. సీబీఐ విచారణ ద్వారానే అసలు వాస్తవాలు బయటపడతాయని అన్నారు.

రూ.12,400 కోట్ల ఫీజు బకాయిలు

ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల బకాయిలపైనా జగన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. 13 త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఒక్కో త్రైమాసికానికి సుమారు రూ.700 కోట్ల చొప్పున రూ.9,100 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. వసతి దీవెన కింద మరో రూ.3,300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రెండు పథకాలకు కలిపి సుమారు రూ.12,400 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.2,900 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు.

బీసీ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. బకాయిలపై శాసనమండలిలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని పార్టీ సభ్యులకు జగన్ సూచించారు.

రైతుల సమస్యలపైనా పోరాటం

రాష్ట్రంలో రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని జగన్ అన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆరోపించారు. పంటలు వేసుకోవాలని చెప్పి రైతులు పెట్టుబడులు పెట్టిన తర్వాత సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెబుతోందని విమర్శించారు. రైతులకు అండగా ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తివేశారని, ఇన్‌పుట్ సబ్సిడీ విధానానికీ ప్రభుత్వం మంగళం పాడిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై కూడా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని పార్టీ సభ్యులకు జగన్ దిశానిర్దేశం చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి రాజీనామా, విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపు, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

# చంద్రబాబుది సొంత డబ్బా!

మొదటి పేజీ తరువాయి



నిరుద్యోగం, వ్యవసాయం, శాంతిభద్రతలు, విద్యుత్ చార్జీలు, పెట్టుబడులు, పోలవరం వంటి అంశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు మద్దతు ధర, ప్రభుత్వ మద్దతు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కేవలం వృద్ధిరేటు గురించి గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.5 మీటర్లకు పరిమితం చేస్తూ దాన్ని ఘనకార్యంగా ప్రచారం చేసుకోవడంపై కూడా షర్మిల ప్రశ్నలు సంధించారు. భవిష్యత్తులో ఈ ఎత్తుతో పోలవరం ద్వారా కలిగే ప్రయోజనాలేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడులపై పారదర్శకత ఏది?

గత రెండేళ్లలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. వాటిలో ఎన్ని ప్రాజెక్టులు వాస్తవంగా భూమిపైకి వచ్చాయో వెల్లడించాలని షర్మిల కోరారు. ఆయా ప్రాజెక్టులకు భూమి, నీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీలు, శాంతిభద్రతలు, విద్యార్థుల సమస్యలు సహా అనేక అంశాలపై ప్రజల్లో ఆందోళనలు ఉన్నాయని షర్మిల పేర్కొన్నారు. ఇవి తన వ్యక్తిగత విమర్శలు కావని, ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలేనని స్పష్టం చేశారు.

# నేడు జన చైతన్య యాత్ర ముగింపు సభ

## -ఖమ్మంలో భారీ ప్రదర్శన

## -హాజరుకానున్న కూనంనేని, బాగం



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** బద్లావ్ జరూరీ హై పేరుతో సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఖమ్మం జిల్లాలో జరిగిన జన చైతన్య యాత్ర ముగింపు సభ గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి -సురేష్ తెలిపారు. ఈనెల ఆరున ప్రారంభమైన జన చైతన్య యాత్ర 250 గ్రామాల్లో సాగిందని ఆయన తెలిపారు. గ్రామాల్లో -నెలకొన్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు మోడీ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయకపోతే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదని హెచ్చరిస్తూ గ్రామాల్లో ప్రచారం చేయడం జరిగిందన్నారు. గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని హామీల అమలుపై స్పందించక పోతే పోరాట కార్యాచరణ రూపొందించుకుని ఆందోళనను ఉధృతం చేస్తామని "సురేష్ తెలిపారు. ముగింపు సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రాంతాల నుంచి ప్రదర్శన నిర్వహించనున్నామని సురేష్ తెలిపారు. మొదటి ప్రదర్శన ఖమ్మం నయాబజార్ జూనియర్ కళాశాల నుంచి బయలుదేరి గాంధీచౌక్ మీదుగా జెడ్పి సెంటరు చేరుకుంటుందని రెండవ ప్రదర్శన అల్లిపురం క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమై ముస్తఫానగర్, బోనకల్ రోడ్డు మీదుగా జెడ్పి సెంటర్కు చేరుకుంటుందన్నారు. మూడవ ప్రదర్శన రోటరీ నగర్ సిపిఐ కార్యాలయం నుంచి బయలుదేరి మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా జెడ్పి సెంటర్కు చేరుకుంటుందని, జెడ్పి సెంటర్ నుంచి మహా ప్రదర్శన పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రంకు చేరుకుంటుందన్నారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సభలో సిపిఐ -రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పి సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు కళా ప్రదర్శన నిర్వహిస్తామని సురేష్ తెలిపారు.

# విప్లవకారుడు సీతారాం ఏచూరి



**కారేపల్లి, కెరటం న్యూస్:** భారతదేశంలో నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా మార్క్సిజాన్ని అన్వయించి అనేక ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేసిన నిజమైన విప్లవకారుడు సీతారాం ఏచూరి అని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సీతారాం ఏచూరి 74వ జయంతి కార్యక్రమం సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం మొదలుకొని సీపీఎం ఆల్ ఇండియా కార్యదర్శిగా ఎన్నిక అయ్యే అంతవరకు ఆయన సుదీర్ఘ ప్రస్థానం సాగిందని నిత్య అధ్యయనశీలి నిరంతరం పేదల కోసం ఈ దేశంలో కార్మిక వర్గ రాజ్యం కోసం కృషిచేల్పిన ఏచూరి జీవితం ధన్యమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని మార్చాలని మొత్తం స్వతంత్ర రాజ్యాంగ వ్యవస్థలని నిర్వీర్యం చేస్తూ సమస్త వర్గాల ప్రజల చట్టాలను హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకే ప్రజా సంపదను అప్పనంగా దోచిపెడుతూ పేదలను మరింత పేదలుగా అమెరికన్ సామ్రాజ్యవాదానికి దేశాన్ని సాగిలపడే విధంగా వ్యవహరిస్తున్న పాలకులు ఉండి ప్రధాని హోంమంత్రి ప్రజలకు సమాధానం చెప్పలేక పార్లమెంట్ కు హాజరు కాకుండా మీడియాకు ముఖం చాటేస్తు ప్రజా తీర్పును రాజ్యాంగాన్ని చట్టాలను అపహాస్యం చేస్తున్న నేటి పరిస్థితుల్లో సీతారామ ఏచూరి లేకపోవడం భారతదేశ ప్రజానీకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత మతోన్మాద నిరంకుశ పాసిస్టు లక్షణాలున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజా చైతన్యంతో ప్రజలను చైతన్య పరిచే ఉధృతమైన పోరాటాలు చేయడమే సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు తలారి దేవ ప్రకాష్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మక్కా సీతారాములు ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆధర్ల వినయ్ కుమార్, సిఐటియు నాయకులు ఆరెల్లి శ్రీరాములు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సంపత్, సైదులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

# చెరుకుమల్లి వెంకటేశ్వరరావును పరామర్శించిన నున్న



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** సిపిఎం నాయకులు ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు వైరా వాస్తవ్యులు కామ్రేడ్ చెరుకుమల్లి వెంకటేశ్వరరావు గారు గత నాలుగు రోజుల కిందట హార్ట్ స్ట్రోక్ రావడంతో వైరా నుండి ఖమ్మం ప్రశాంతి హాస్పిటల్ లో వైద్యం చేయించుకుని ప్రమాదం నుండి బయటపడి స్టంట్లు వేసుకొని విశ్రాంతిలో ఉన్నారు వారిని ఈరోజు ఖమ్మంలో సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నున్న నాగేశ్వరరావు సిపిఎం నాయకులు కే దేవేంద్ర, నవ తెలంగాణ ఎడిటర్ ఆనందాచారి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నామ లక్ష్మీనారాయణ వేముల సదానంద్, గోపి తదితరులు పరామర్శించారు నున్న నాగేశ్వరరావు గారు వారి ఆరోగ్య పరిస్థితిని కనుక్కొని ధైర్యంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయండి

**టి జే ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్**

**అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్లు ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ కు టి జే ఎఫ్ వినతి**



**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** గతంలో మాదిరిగా ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ యధావిధిగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు.

అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద, మీడియం, చిన్న పత్రికలు, చానళ్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులుకు జిల్లా కేంద్రాలలో, మున్సిపాలిటీ కేంద్రాలలో ఉన్న రిపోర్టర్లకు కార్డులు తగ్గించటం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం నియోజకవర్గాల ఇన్చార్జిలకు జిల్లా కార్డులు ఇవ్వాలని, వారికి రాష్ట్రస్థాయి బస్సు పాసుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంప్యానల్ ఉన్న కేబుల్ ఛానల్ కు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వివరించారు. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

దీనికి కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డి పి ఆర్ ఓ గౌస్ ను ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె టిజెఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్న బోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందుల ఉపేందర్, హరీష్, మందటి రమణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ రామి శెట్టి విజేత, అడపాల నాగేందర్, శాస్త్రి, ఫోటోగ్రాఫర్ రాజు, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, అమరవరపు కోటేశ్వరరావు, ఎస్వీ రెడ్డి, రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, గోవిందు, రోసి రెడ్డి,ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మాధవి, కిరణ్మయి, పెంటి వెంకటేశ్వర్లు, మోహన్, సాయి, గౌరీ శంకర్, పాశం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటమే

# సీతారాం ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళులు

## నున్నా నాగేశ్వరరావు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి






**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** సీతారాం ఏచూరి 74 జయంతి సందర్భంగా ఖమ్మం సుందరయ్య భవనంలో చిత్రపటానికి సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్ అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.

సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుండి అభ్యుదయ భావాలతో ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో కీలకంగా పని చేశారు దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయం జేఎన్యు కాలేజీకి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులుగా కొనసాగారు తర్వాత కాలంలో సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా పోలిట్ బ్యూరో సభ్యులుగా అఖిల భారత కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వహించారు పార్లమెంట్లో రాజ్యసభ సభ్యులుగా సిపిఎం పార్టీ తరఫున కొనసాగారు దేశంలోని అనేక సమస్యలపై రాజ్యసభలో అనేక అంశాలపై మాట్లాడారు. కార్పొరేట్ మతోన్మాద విధానాలు కొనసాగిస్తున్న బిజెపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణ వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్ని నిర్వహించారు, మరోవైపు సామ్రాజవాదులకు తలోగ్గి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు జూనియర్ భాగస్వామిగా మోడీ ప్రభుత్వం కొనసాగింది. భారతదేశంలో సుంకలు విధిస్తూ దేశ సంపదను కొల్లగొట్టి షరతులకు లొంగిపోయి నేడు భారత ప్రధాని అమెరికా దేశానికి దాసుడిగా మారారు, దీని ఫలితంగా దేశంలోని ఉత్పత్తులు రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక సంక్షోభంలోకి కోరుకుపోతున్నారు. స్వేచ్ఛ వాణిజ్యం

పేరుతో దేశంలోకి విదేశీ దిగుమతులకు అవకాశాలు కల్పిస్తూ. దేశంలో ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువులకు కొనుగోలు లేకుండా నేడు కేంద్రంలో పాలన కొనసాగిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ విధానాలు సాగుతున్నాయి. మరోవైపు ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ కీలక రంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు గుత్త పెట్టుబడుదలకు కట్టబెడుతున్నారు. దీని ఫలితంగా ప్రభుత్వారంగం సంక్షోభంలోకి కూరకపోతుందని అన్నారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయి,విచ్చిన కర శక్తులు మతోన్మాదం. కులతత్వాలు పెరుగుతున్నాయని అన్నారు. దేశంలో రోజురోజుకు కార్పోరేట్ శక్తులు ఒక్క శాతంగా ఉన్న సంపన్న వర్గాల చేతుల్లో 47% సంపద ఉన్నది మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఈ సంపన్న వర్గాలు దేశానికి 16 లక్షల కోట్ల రూపాయలు బకాయి ఉన్నారు వాటి రద్దు చేయటం కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్య. కార్మికులను రైతులను వ్యవసాయ కూలీ వర్గాలను వారి చట్టాలను వారి హక్కులను అరించి వేస్తూ కార్పొరేట్ మతోన్మాద శక్తులకు నేడు ప్రభుత్వం కొమ్ము కాస్తున్నది. మోడీ ప్రభుత్వం ఆదాని అంబానీ సంపన్న వర్గాలకు కొమ్ముగా వస్తుందని అనటానికి ఇది నిదర్శనం అని అన్నారు. సీతారాం ఏచూరి మోడీ ప్రభుత్వం మతోన్మాద విధానాలకు కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో అన్ని వర్గాలను ఐక్యపరిచి ఇండియా కూటమి ఏర్పాటుకు కీలక పాత్ర పోషించారు. యూపీఏ ప్రభుత్వం పాలనలో కీలకంగా ఉపాధి హామీ చట్టాన్ని. సమాచార హక్కు చట్టం కోసం. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని. అటవీ హక్కుల బిల్లు కోసం ప్రభుత్వ తో కీలకంగా చర్చలు జరిపి ఆ చట్టాలను తీసుకురావడంలో ఏచూరి కీలకపాత్ర పోషించారఅని అన్నారు మార్క్సిజం భారతదేశ పరిస్థితులను అనుగుణంగా ఉద్యమాలను నిర్మించడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర వహించారు అన్నారు ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు దేశ ప్రజలకు తీరనిలోటు. దేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో సీతారాం ఏచూరి ఒకరు . ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని నున్న నాగేశ్వరరావు అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్. కళ్యాణం వెంకటేశ్వరావు. మాచర్ల భారతి. బుగ్గ వీటి సరళ యర్రా శ్రీనివాసరావు . మాదినేని రమేష్. బండి పద్మ. మెరుగు సత్యనారాయణ,పారుపల్లి ఝాన్సీ, దొంగల తిరుపతిరావు, ఎస్. మీరా,పి. రమ్య, మెరుగు రమణ,విష్ణు, బోడపట్ల సుదర్శన్,దేవేంద్ర, ప్రకాష్, ప్రవీణ్, బి.మధు, బివికె వై. శ్రీనివాస్ రావు, వాసిరెడ్డి వీరభద్రం, అఫ్జల్, గోవింద్ రావు, వెంకన్న బాబు, పడిగల నాగేశ్వరరావుతదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఎంఎంటీఎస్ విస్తరణకు తక్షణ చర్యలు చేపట్టాలి -ఎంపీ వద్దిరాజు




**న్యూ ఢిల్లీ- కెరటం న్యూస్:** ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్)ను విస్తరించి, ఆధునీకరించేందుకు వెంటనే తగు చర్యలు చేపట్టాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యసభలో బుధవారం ఆయన ప్రత్యేక ప్రస్తావన కింద హైదరాబాద్ ఎంఎంటీఎస్ విస్తరణ, ఆధునీకరణ అంశం గురించి మాట్లాడారు.

హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాలలో ఒకటన్నారు. నగర జనాభా, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపార వర్గాల రోజువారీ రాకపోకలు రోజురోజుకు గణనీయంగా పెరుగుతున్నాయని రవిచంద్ర వివరించారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న ఎంఎంటీఎస్ సేవలు సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థగా ఉన్నప్పటికీ, నగర అవసరాలకు అనుగుణంగా నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సి ఉందన్నారు.

హైదరాబాద్ రైల్వే, పట్టణ రవాణా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గణనీయమైన పెట్టుబడులు పెట్టిందని ఎంపీ వద్దిరాజు తెలిపారు. అయితే ఎంఎంటీఎస్ ఫేజ్--2 కింద ఇప్పటికే ఆమోదం పొందిన, ప్రతిపాదిత పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎంఎంటీఎస్ స్టేషన్లను మెట్రో రైలు స్టేషన్లతో మెరుగ్గా అనుసంధానించడం ద్వారా సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చని రవిచంద్ర చెప్పారు.. ప్రయాణీకులు ఒక రవాణా వ్యవస్థ నుంచి మరో చోటకు సులభంగా మారేలా ఇంటిగ్రేషన్ సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సలహా నిచ్చారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు, ఐటీ కారిడార్ల వైపు సబర్బన్ రైలు కనెక్టివిటీని విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా ఆయన కేంద్రాన్ని కోరారు. అదనపు ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రవేశపెట్టడంతో పాటు స్టేషన్లలో మౌలిక వసతులను మెరుగుపరచాలని ఎంపీ రవిచంద్ర సూచించారు.

ఎంఎంటీఎస్ ను మరింత బలోపేతం చేయడం ద్వారా నగరంలో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడటం,ట్రాఫిక్ రద్దీ, వాయు కాలుష్యం, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుందన్నారు. లక్షలాది మంది ప్రయాణీకులకు తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు.

రైల్వే, కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు హైదరాబాద్ ఎంఎంటీఎస్ విస్తరణ, ఆధునీకరణకు మరింత ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాల్సిందిగా ఆయన కోరారు.

హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎంఎంటీఎస్ సమగ్ర విస్తరణకు, ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.






# ‘చిరు లీక్స్’ మరోసారి వైరల్..

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ‘చిరు లీక్స్’తో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. కేఎస్ రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో తెరకెక్కుతున్న తన 158వ సినిమాకు ‘కదిరి’ అనే టైటిల్‌ను చిరంజీవి స్వయంగా లీక్ చేశారు. వరుణ్ తేజ్ ‘కొరియన్ కనకరాజు’ సక్సెస్ మీట్‌లో సరదాగా జరిగిన సంభాషణలో ఈ టైటిల్ బయటపడింది.

ఇక చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న ‘కదిరి’ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ‘వాల్తేరు వీరయ్య’ తర్వాత చిరంజీవి--బాబీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో ప్రియమణి కథానాయికగా నటిస్తుండగా.. రచితా రామ్, నివేదా పేతురాజ్, అనశ్వర రాజన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



## ప్రియాంకా లైనప్‌లో మరో హాలీవుడ్ ప్రాజెక్ట్!

గ్లోబల్ స్టార్ ప్రియాంకా చోప్రా ఖాతాలో మరో ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ చేరింది. రస్సెల్ క్రోతో కలిసి ఆమె నటించనున్న సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ ‘బ్లూఫై’ చిత్రానికి నిమ్రోడ్ అంటాల్ దర్శకత్వం వహించనున్నారు. కాంగో బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథ ఓ సీక్రెట్ మిషన్ చుట్టూ తిరుగుతుందని సమాచారం. ఇందులో ప్రియాంకా ఎమోషనల్ క్యారెక్టర్‌తో పాటు యాక్షన్ సన్నివేశాల్లోనూ కనిపించనుంది.

మరోవైపు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న ‘వారణాసి’లోనూ ప్రియాంకా కీలక పాత్ర పోషిస్తోంది. ‘మందాకిని’గా ఆమె కనిపించనుంది. అలాగే ‘జీ లే జరా’, ‘క్రిష్ 4’ వంటి ప్రాజెక్టులు కూడా ఆమె లైనప్‌లో ఉన్నాయి. దీంతో వరుస గ్లోబల్ ప్రాజెక్టులతో ప్రియాంకా దూసుకెళ్తోంది.




# మీర్జాపూర్ మూవీ ట్రైలర్ రిలీజ్..

యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఓటీటీలో పాపులారిటీ సొంతం చేసుకున్న ‘మీర్జాపూర్’.. ఇప్పుడు సినిమాగా రానున్న విషయం తెలిసిందే. ‘మీర్జాపూర్ ది మూవీ’ పేరుతో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత ఫర్హాన్ అక్తర్ మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఆదరణ వల్లే దీన్ని సినిమాగా రూపొందించాలనే ఆలోచన వచ్చినట్లు స్పష్టం చేశారు. “2018లో మొదటి సీజన్ విడుదలైనప్పటి నుంచే ప్రేక్షకులు దీనికి ఎంతో మద్దతుగా నిలిచారు. అమెజాన్ ప్రైమ్ దీనిని ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్ళింది. నేను ఎక్కడికి వెళ్లినా ‘మీర్జాపూర్’ కొత్త సీజన్ ఎప్పుడు వస్తుందని అందరూ నన్ను అడిగేవారు. సినిమా ప్రకటన వచ్చిన తర్వాత కూడా విడుదల తేదీ గురించి ఆరా తీశారు. నిజానికి అభిమానుల కోరిక మేరకే ఈ సినిమాను తీసుకొస్తున్నాం. పాత తారాగణంతో పాటు కొత్త నటీనటులతో కలిసి దీనిని రూపొందించినందుకు చాలా సంతోషంగా ఉంది” అని తెలిపారు.

# నివిన్ పాలీ సినిమాతో మలయాళంలోకి రుక్మిణీ వసంత్ ఎంట్రీ!



కన్నడ నుంచి వచ్చి సౌత్‌లో వరుస అవకాశాలతో దూసుకెళ్తున్న రుక్మిణీ వసంత్.. ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పౌలీ సరసన కథానాయికగా ఆమె ఎంపికైనట్లు తెలుస్తోంది. ‘జయ జయ జయ జయ హే’ ఫేమ్ నషిద్ ఫామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే యశ్ నటిస్తున్న పాన్ ఇండియా మూవీ ‘టాక్సిక్’, ఎన్టీఆర్--ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’లో రుక్మిణీ భాగమైంది. తాజాగా రామ్ చరణ్--సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న RC1లోనూ ఆమె పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ క్రేజ్ మరింత పెరుగుతోంది.

# సినిమాల్లో అవకాశాలు రావని భయపడ్డా: సమంత

నటి సమంత ‘మా ఇంటి బంగారం’తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. యాక్షన్ సినిమాల్లో నటించడం అంత సులభమైన విషయం కాదన్నారు. సొంతంగా సినిమాలు నిర్మించడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిర్మాణ రంగం తనకిచ్చిన సృజనాత్మక స్వేచ్ఛ.. నటన ఇవ్వలేదని తెలిపారు.

“మయోసైటిస్ వచ్చిందని తెలిసినప్పుడు ఓ ఆలోచన నన్ను కలవరపెట్టింది. ఇక సినిమాలోకి తీసుకోవడానికి నిర్మాతలు ఆలోచిస్తారేమోనని భయపడ్డాను. కానీ, ఇప్పుడు నేనే నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసి సినిమాలు నిర్మిస్తున్నాను. వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాను. చిత్ర పరిశ్రమలో కొనసాగుతూనే కెమెరా ముందు కాకుండా వెనక కూడా నాకు నచ్చిన పనులు చేస్తున్నాను” అని అన్నారు. యాక్షన్ పాత్రల గురించి సమంత మాట్లాడుతూ, ‘ది ఫ్యామిలీ మ్యాన్, సిటాడెల్: హనీ బన్నీ సిరీస్‌లలో నేను చేసిన యాక్షన్ సీన్లకు మంచి స్పందన రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అమ్మాయిలు యాక్షన్ సన్నివేశాలు చేస్తే ప్రేక్షకులు అంత సులభంగా అంగీకరించరు. ఆ ధోరణిని తీసివేయాలనుకుంటున్నా. హీరోయిన్స్ కూడా అన్ని చేయగలరని నిరూపించాలని అనుకుంటున్నా. సినిమాలో దెబ్బలు తింటూ, ఫైట్స్ చేయడం నాకెంతో ఉత్సాహాన్నిస్తుంది” అని పేర్కొన్నారు.



# టామ్ క్రూజ్‌కు నాపై క్రష్ ఉంది.. మల్లికా షెరావత్ హాట్ కామెంట్స్!

బాలీవుడ్ హాట్ బ్యూటీ మల్లికా షెరావత్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఆగస్టు 13 నుంచి స్ట్రీమింగ్ కానున్న ‘ది ట్రైటర్స్ సీజన్ 2’లో పాల్గొన్న ఆమె.. హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. షోలో ఓ కంటెస్టెంట్ అడిగిన ప్రశ్నకు మల్లికా స్పందిస్తూ.. “అందరికీ నాపైనే క్రష్ ఉంటుంది. ఇటీవల టామ్ క్రూజ్ కూడా నాపై మనసు పారేసుకున్నారు. నా దగ్గర ఫోన్ ఉంటే ఆయన పంపిన వీడియోలు కూడా చూపించేదాన్ని” అంటూ చెప్పింది. తామిద్దరం కలిసి పార్టీల్లో పాల్గొన్న సందర్భాలకు సంబంధించిన వీడియోలని ఆమె తెలిపింది. అయితే మల్లికా వ్యాఖ్యలపై టామ్ క్రూజ్ లేదా ఆయన ప్రతినిధుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

ఇక ‘ది ట్రైటర్స్ సీజన్ 2’లో మల్లికా షెరావత్‌తో పాటు మునవర్ ఫరూఖీ, శ్వేతా తివారీ, రియా చక్రవర్తి, అభిషేక్ మల్హాన్ తదితరులు పాల్గొంటున్నారు.

